క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: కోతుల దాడిలో ఈనెల 21న మృతి చెందిన లక్ష్మి కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం బుధవారం పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయంతోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సురేశ్, అమానుల్లాఖాన్, షబ్బీర్ పాషా తదితరులు ఉన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: జాబ్‌కార్డు కలిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని దేగాం గ్రామంలో ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. పనులు పూర్తయిన వెంటనే కూలీలకు డబ్బులు చెల్లించాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పట్టణంలోని ఏరియాస్పత్రిలో బుధవారం పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించా రు. ఇందులో భాగంగా పలువురు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఏఎస్పీ అవి నాష్‌కుమార్ సైతం రక్తదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు గోపీనాథ్, నైలు, ఎస్సైలు ప్రదీ ప్, ఎండీ గౌస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి

భైంసాటౌన్: ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలని పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ రసాయన శాస్త్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రిన్సిపాల్ మాట్లాడారు. కళాశాలలో 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని అధ్యాపకులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర హెచ్ఓడీ రఘునాథ్, అధ్యాపకులు పీజీరెడ్డి, రవికుమార్, పవన్ పాండే, శంకర్, ఓం ప్రకాశ్, సంతోష్, హర్ష సుల్తానా, శ్రావణ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కుమురం సూరుకు నివాళి



నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

పెంబి: కుమురం భీం, కుమురం సూరును స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసీలు ముందుకు సాగాలని తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. మండలంలోని వేణునగర్‌లో బుధవారం కుమురం సూరు 27వ వర్ధంతిని ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సూరు చిత్రపటానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఐటీడీఏ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని.. ప్రతిఒక్కరూ తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. అనంతరం గిరిజన ఆదివాసీ గూడేలకు రోడ్డు, నీటి, పోడు భూములకు త్రీఫేజ్ కరెంట్ సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ జిల్లా నాయకుడు భీంరావు, రమేశ్, పెద్దయ్య, లక్ష్మణ్, శ్రీ నివాస్, దేవ్‌రావు, రాజు తదితరులు ఉన్నారు.

బైక్,కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

బాసర: మండల కేంద్రంలోని ట్రిపుల్ ఐటీ కళాశాల వద్ద బుధవారం కారు.. బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. క్షతగాత్రులను నిజామాబాద్ జిల్లా యంచ గ్రామానికి చెందినవారిగా స్థానికులు గుర్తించారు. భైంసా నుంచి తిరుగుప్రయాణంలో బైక్‌పై వెళ్తుండగా ఓ కారు వారిని ఢీకొట్టింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ వారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

సారంగాపూర్: బాల్యవివాహాల నిర్మూలనకు అందరం కలిసి పని చేద్దామని విజన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రజిత అన్నారు. మండలంలోని జామ్ కేజీబీవీలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో రక్షణ

భైంసారూరల్: సీసీ కెమెరాలతో రక్షణ ఉండి నేరాలను నియంత్రించవచ్చని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. బుధవారం భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. రద్దీ ప్రదేశాలు, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఆలయాల్లో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు బిగించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు, పోలీసులు ఉన్నారు.

కుభీర్: ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో మండలంలోని ఆలయాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఆలయాల రక్షణ బాధ్యతను కమిటీ చూసుకోవాలని పేర్కొన్నారు. పోలీసులు సైతం గస్తీ నిర్వహిస్తారని.. అనుమానితులు కన్పిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. విఠలేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షులు పెంటాజీ, చంద్రశేఖర్, సాయినాథ్ ఉన్నారు.

కుంటాల: పోలీస్‌స్టేషన్‌లో ప్రార్థన, మందిరాల ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులకు సీసీ కెమెరాలపై ఎస్సై భాస్కరాచారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దస్తురాబాద్: ఆలయాల రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై శంకర్ సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయా గ్రామాల్లోని ఆలయాల అర్చకులు, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో అర్చకులు కొండమాచార్యులు, నరేషాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కుభీర్ : మాట్లాడుతున్న భైంసారూరల్ సీఐ నైలు

సోన్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కే.గోపి తెలిపారు. బుధవారం మండలంలోని హనుమాన్ దేవాలయంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సోన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: గ్రామాల్లో ఉన్న ప్రధాన ఆలయాల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని అడెల్లి మహాపోచమ్మ, వంజర్ మహా లక్ష్మీ, జామ్, స్వర్ణ గ్రామాల్లోని రామాలయాలు, లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, ఇతర ఆలయాల ప్రతినిధులతో పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 24గంటలు పని చేసే వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అడెల్లి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, సిబ్బంది, గ్రామాల్లోని ఆలయాల నిర్వాహకులు ఉన్నారు.



సారంగపూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

లక్ష్మణచాంద: ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సుమలత సూచించారు. మండలంలోని కనకాపూర్, బాబాపూర్ గ్రామాల్లో పర్యటించిన ఎస్సై ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఏఎస్సై నారాయణరెడ్డి, సిబ్బంది, ఆయా గ్రామాల ఆలయ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

బాసర: మండలవ్యాప్తంగా ప్రధాన వీధులు, చౌరస్తాలు, ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై గణేశ్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో పలు ఆలయాల కమిటీ సభ్యులతో మాట్లాడారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

- జెడ్పీ సీఈవో గోవింద్

సోన్: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సరుకులు, భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పాఠశాలలో విరివిగా మొక్కలు నాటడంతోపాటు మూత్రశాలలు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భారిక, సిబ్బంది తదితరులు ఉన్నారు.



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో గోవింద్

అగ్నిప్రమాదంపై విచారణ చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల జిల్లా జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో జరిగిన అగ్నిప్రమాదంపై విచారణ చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి జగన్‌మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి సూపరింటెండెంట్ గోపాల్‌సింగ్‌ను ప్రమాద ఘటన వివరాలు తెలుసుకున్నారు. షార్ట్‌సర్క్యూట్ అయితే శానిటరీ గదుల్లో ప్రమాదం ఎలా జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. ఆసుపత్రిపై నిర్లక్ష్యం తగదని.. నిధులు కేటాయించి నిఘా పెంచాలని కోరారు. వారి వెంట నాయకులు కుక్కరకారి రాజేశ్, జిల్లా మహిళా కన్వీనర్.ఎస్ కె లక్ష్మీయాదవ్, ఖానాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గొల్ల భీమన్న, ప్రభాకర్, రాజేశ్, చంద్రయ్య ఉన్నారు.

'ఆలయాలపై దాడి హేయమైన చర్య'

నిర్మల్‌చైన్‌గేట్: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఆలయాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ ముత్యాలమ్మ విగ్రహంపై జరిగిన దాడికి నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో నిరసన తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటనపై రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యేలు స్పందించాలని కోరారు. నిందితులపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎడిపెల్లి నరేందర్, పద్మాకర్, భీట్లింగ్ నవీన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఓడిశెల అర్జున్, కూన లింగన్న, ఆకుల కార్తీక్, ముప్పిడి రాకేశ్, సుంకరి సాయి, విగ్నేశ్, మహేందర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో నిరసన తెలుపుతున్న సమితి సభ్యులు

తానూరు: సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడిని శిక్షించాలని డిమాండ్‌చేస్తూ బుధవారం తానూరులో హిందువాహిని, భజరంగ్‌దళ్, బీజేపీ ఆధ్వర్యంలో బంద్ పాటించారు. దుకాణదారులు బంద్‌కు మద్దతు ప్రకటించారు. అనంతరం తహసీల్దార్ లింగంమూర్తికి వినతిపత్రం అందజేశారు. గంగాప్రసాద్, సాయి, మణికంఠ, యోగేశ్, పోశెట్టి, బాలాజీ, సంతోష్ ఉన్నారు.

ఏఈవోలను విధుల్లోకి తీసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఏఈవోలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ జిల్లాకు చెందిన ఏఈవోలు బుధవారం హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ సస్పెండ్ చేసిన ఏఈవోలను వెంటనే తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ఏఈవోల సస్పెన్షన్ హేయమైన చర్య

నిర్మల్‌ఖిల్లా: రైతుభీమా నిర్వహణలో నిర్లక్ష్యం చేశారనే కారణంతో రాష్ట్రంలోని 165 మందికి పైగా వ్యవసాయ విస్తరణ అధికారులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్)ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేను వ్యతిరేకిస్తున్నారనే అక్కసుతోనే సస్పెన్షన్ చర్య తీసుకున్నారని, 20 వేల మంది చేయాల్సిన పనిని కేవలం 2,600 మందితో చేయించడం సబబుకాదన్నారు. తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్‌కు తరలిన ఏఈవోలు

ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలి

మామడ: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని రాశిమెట్ల ఆశ్రమ పాఠశాల, తాండ్ర అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోషకాహారం, అయోడైజ్డ్ ఉప్పు వినియోగంపై అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ విమల, సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎం భాగ్యరేఖ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆకొండపేట అంగన్‌వాడీ కేంద్రంలోని 11 మంది, పేర్కపల్లెలోని ముగ్గురు చిన్నారులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందించామని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీలు రాజమణి, గీతాంజలి, ఆశ వర్కర్లు సుజాత తదితరులు పాల్గొన్నారు.



మామడ : చిన్నారి ఎత్తు పరిశీలిస్తున్న సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ..

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీవో రత్నాకర్‌రావు బుధవారం తనిఖీ చేశారు. అనంతరం చందునాయక్‌తండా, బావాపూర్(ఆర్), దాసునాయక్ తండా, రాజురా గ్రామాల్లో పర్యటించి సిబ్బంది చేత వాటర్‌ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. అనంతరం పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు.

తానూరు: మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో అబ్దుల్ సమద్ తనిఖీ చేశారు. కేంద్రంలోని చిన్నారులు, గర్భిణుల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్ వందన, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న వైనం
- భైంసా మండలం దేగాం వద్ద ఘటనలు
- ఏరియా ఆసుపత్రి వద్ద మిన్నంటిన కుటుంబీకుల రోదనలు

భైంసారూరల్: భైంసా నుంచి బాసర వెళ్లే జాతీయ రహదారిపై దేగాం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. వీరిని గుర్తుతెలియని వాహనాలు ఢీ కొట్టడంతో ప్రమాదాలు సంభవించినట్లు పలువురు స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా..

కుభీర్ మండలం పాంగ్రా గ్రామానికి చెందిన నమత్కర్ సాయినాథ్(34) బుధవారం భైంసా మండలంలోని వాలేగాంలో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి ప్రయాణమయ్యాడు. దేగాం గ్రామం వద్ద జాతీయ రహదారిపై వంతెన సమీపంలో ఇతడి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సాయినాథ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు భైంసా ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

రైసుమిల్లు వద్ద జరిగిన ప్రమాదంలో..

ముధోల్ మండలం సరస్వతీనగర్‌కు చెందిన మురళీధర్(37) బుధవారం బైక్‌పై భైంసాకు వెళ్లాడు. పనులు ముగించుకుని రాత్రి ఇంటికి బయలుదేరాడు. దేగాం సమీపంలోని రైస్‌మిల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బైక్‌పై వెళ్తున్న మురళీధర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇలేగాం వాసికి తీవ్రగాయాలు..

దేగాం గ్రామ సమీపంలోనే బుధవారం రాత్రి నడిచి వెళ్తున్న ఇలేగాంకు చెందిన యువకుడిని ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రున్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ట్యాంక్ పనులు ప్రారంభం

ఖానాపూర్: అమృత్–2 పథకం కింద పట్టణంలోని ఒకటో వార్డులో చేపట్టే వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్ ప్రారంభించారు. ఐదు లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో ట్యాంక్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, షబ్బీర్‌పాషా, కమిషనర్ మనోహర్ తదితరులు ఉన్నారు.

'దేశ హితం కోసం ఏబీవీపీ పోరాటం'

నిర్మల్‌చైన్‌గేట్: దేశ, సమాజ హితం కోసం ఏబీవీపీ పోరాడుతుందని విభాగ్ సంఘటన కార్యదర్శి రాజుసాగర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఏబీవీపీ అని.. కార్యకర్తలు విద్యారంగ సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం 2024–25 సంవత్సరానికి ఏబీవీపీ నిర్మల్ నగర కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రముఖ్ ఈశ్వర్, ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్, రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షుడు సూర్యకుమార్, రాష్ట్ర వానవాసి ప్రముఖ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నగర కార్యవర్గం..

నిర్మల్ నగర కార్యదర్శిగా సాయికుమార్, నగర ఉపాధ్యక్షులుగా విలాస్, నితిన్, నిమ్మలసాయి, విష్ణు చరణ్, నగర సంయుక్త కార్యదర్శిగా మున్నా, జీవన్, చరణ్, అంబాదాస్, సోషల్ మీడియా కన్వీనర్‌గా లక్ష్మణ్ , రాజు, నవనీత్, మీడియా ఇన్‌చార్జిగా విశాల్, సింహాద్రి, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్‌గా దీపక్, మల్లేశ్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా మనోజ్, కార్తీక్, హాస్టల్ కన్వీనర్లుగా ఎలిసా, వంశీ ఖేల్ కన్వీనర్లుగా జశ్వంత్, హర్షవర్ధన్, సిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రాకేశ్, రవి, హాసిన్, అంబేద్కర్ జోనల్ ఇన్‌చార్జిగా శేఖర్, ముకేశ్, సిద్ధార్థ, ఛత్రపతి శివాజీ జోనల్ ఇన్‌చార్జిగా నవదీప్, రామాలయం జోనల్ ఇన్‌చార్జిగా వేణు, జగదీశ్, పెహాన్, రానా ప్రతాప్ జోనల్ ఇన్‌చార్జిగా నరేందర్, అజయ్, రేహాన్ ఎన్నికయ్యారు.



ఎన్నికైన ఏబీవీపీ కార్యవర్గం

సంక్షిప్త వార్తలు

న్యూబొప్పారంలో గ్రామసభ

సోన్: మండలంలోని న్యూబొప్పారం వాటర్ సఫీషియంట్(తగినంత నీటి లభ్యత) గ్రామపంచాయతీగా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన సందర్భంగా బుధవారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. మంచినీటి ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీవో ఖలీల్ హైమద్, ఎంపీవో మంజులరెడ్డి, ఏపీవో గంగామణి, కార్యదర్శి అశోక్, మహిళా సంఘల సభ్యులు అంగన్‌వాడీ టీచర్లు శకుంతల, అనురాధ, సంధ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిచెన్‌గార్డెన్ పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో పారిశుద్య పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పొట్టపెల్లి(కే) ప్రాథమిక పాఠశాలలో కిచెన్‌గార్డెన్ పరిశీలించారు. కిచెన్ గార్డెన్‌లో కూరగాయలు, ఆకుకూరలు పెంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందించాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గడ్‌చాందలో సభ్యత్వ నమోదు

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాందలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డి, మహిళా మోర్చా మండలాధ్యక్షురాలు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిరావును కలిసిన గ్రంథాలయ చైర్మన్

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులైన సయ్యద్ అర్జుమండ్ అలీ బుధవారం నిర్మల్‌లో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నిర్మల్, సారంగపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమ భీంరెడ్డి, అబ్దుల్ హాది, పట్టణాధ్యక్షుడు చిన్ను, ఈటల శ్రీనివాస్, మతీన్, అజర్, జునైద్, కొట్టే శేఖర్, లక్ష్మణచాంద మాజీ ఎంపీపీ నరేశ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కొంతం గణేశ్, సారంగపూర్ మాజీ జెడ్పీటీసీ రొడ్డ మారుతిరెడ్డి ఉన్నారు.

'ఎమ్మెల్సీగా గెలిపించండి'

లోకేశ్వరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు.పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాజారాం ఉపాధ్యాయులు ఉన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బుధవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదం, ఆశీర్వచనాలు అందించారు. అనంతరం శ్రీహరిరావుకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమభీంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, ఏఎంసీ మాజీ చైర్మన్ చిలుక రమణ, గంగాధర్, దేవరకోట చైర్మన్ కొండ శ్రీనివాస్, పోతన్న, శ్రీనివాస్, చైతన్య, పరంకుశం వంశీ, సాయన్న ఉన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ సమీపంలోని మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను బుధవారం ఎస్సై ఎం. కృష్ణసాగర్ రెడ్డి బ్లేడ్ ట్రాక్టర్‌తో శుభ్రం చేయించారు. ఇటీవల ఈ ప్రదేశం వద్ద రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని.. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

తానూరు: మండలంలోని ఎల్వి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బుషి సుధాకర్, భైంసా బెటాలియన్ ఆర్ఎస్సై బి.శివ నోట్‌బుక్‌లు సమకూర్చగా బుధవారం ఎంఈవో నరేందర్ పంపిణీ చేశారు. నోట్‌బుక్‌లు అందించిన సుధాకర్, శివను ఎంఈవో అభినందించారు. ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, హరీశ్, విద్యార్థుల పోషకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కుంటాల: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. బుధవారం కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీవో ఎం.ఏ రహీం, ఏపీఓ నవీన్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఖానాపూర్: దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఆశావర్కర్లతో కలిసి ఎయిడ్స్, క్షయ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది వేణు, మీరాబాయి తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

లోకేశ్వరం: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ చంద్రకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని రాజురా ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాజారాం ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలి

భైంసారూరల్: సౌకర్యాలు కల్గిన ప్రభుత్వ ఆ సుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవాలని సూపర్‌వైజర్ దేవమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సుంక్లి గ్రామంలో గర్భిణులకు ప్రసవాలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రులకు క్రమం తప్పకుండా వచ్చి వై ద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఈఓ సలీం, సిబ్బంది దత్తురాం, ఏఎన్ఎం సుజాత, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశవర్కర్లు ఉన్నారు.

సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన

- గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

కుభీర్: బీజేపీ సభ్యత్వ నమోదుకు మహిళలు, యువకులు, వ్యాపారులు, రైతుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్ అన్నారు. బుధవారం కుభీర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు 30 లక్షల సభ్యత్వ నమోదు పూర్తవగా.. అందులో 1.5 లక్షలు గిరిజనులున్నారని చెప్పారు. రాష్ట్రంలో హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా కుభీర్‌లో గిరిజన యువకుడిపై దాడి విషయాన్ని జాతీయ గిరిజన కమిషన్ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. అంతకుముందు కుభీర్ సేవా లాల్ మందిరంలో పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏ శాల దత్తాత్రి, కమలేష్, పండి త్ జాదవ్, జాదవ్ అజయ్, ఆనంద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్యాణ్‌నాయక్

ఆపదలో విద్యార్థికి అండ

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామానికి చెందిన అనూష(13) అనే విద్యార్థిని ఇటీవల ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటుకు గురై 10 రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈవిషయం తెలుసుకున్న వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బుధవారం తిర్పెల్లిలో అనూషను పరామర్శించారు. సంస్థ ద్వారా రూ.50 వేల విలువైన చెక్కును ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వరల్డ్ విజన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, రజినీకాంత్, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అనూషకు చెక్కు అందిస్తున్న శ్రీనివాస్